క్లుప్తంగా

అయ్యప్పస్వామి పూజల్లో మంత్రి



పాళెంలోకొండపై వెలసిన అయ్యప్ప స్వామి పూజల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని పాళెం కొండపై ఉన్న అయ్యప్ప స్వామిని సోమవారం రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖామంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, జిల్లా వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు హేమ సుందరరెడ్డి, రాజాస్వామి తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



సదుంలో కలిసిన పూర్వ విద్యార్థులు

సదుం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1993–94 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తాము చదివిన తరగతి గదుల్లో తిరుగుతూ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. తమ అభ్యున్నతికి బాటలు వేసిన గురుదేవులను స్మరించారు.

21న బ్రాహ్మణ సంఘ సమావేశం

పుంగనూరు: నియోజకవర్గ బ్రాహ్మణ కుటుంబ సభ్యుల సమావేశం ఈనెల 21న పుంగనూరులో నిర్వహించనున్నట్లు మంగళవారం శ్రీగాయత్రి మాత తాలూక బ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు తెలిపారు. దీనికి సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. వారు మాట్లాడుతూ, మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి తమ సంఘానికి 25 సెంట్ల భూమిని కేటాయించారని, ఇందులో కమ్యూనిటీ భవనం నిర్మించనున్నట్లు తెలిపారు. అలాగే నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు చెప్పారు.

మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నేత చంద్రమోహన్ రెడ్డి

రామకుప్పం: మండలంలోని మణీంద్రం గ్రామానికి చెందిన మునెమ్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఇది తెలుసుకున్న ఎమ్మెల్సీ భరత్ స్థానిక వైఎస్సార్ సీపీ సీనియర్ నేత చంద్రమోహన్ రెడ్డి ద్వారా మృతురాలి కుటుంబానికి రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నేతలు రఘు, దేవరాజు రెడ్డి, శివప్రకాష్, సూరప్ప తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైక్లిస్ట్‌కు గాయాలు

పుంగనూరు: పట్టణ సమీపంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద ఈచర్ లారీ ఢీకొనడంతో మోటార్ సైక్లిస్ట్ తీవ్రంగా గాయపడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు..మండలంలోని పత్తెమ్మగారిపల్లెకు చెందిన శివ ద్విచక్రవాహనంలో వస్తుండగా మితిమీరిన వేగంతో వచ్చిన లారీ అతడిని ఢీకొంది. ఈ ప్రమాదంలో శివ తలకు తీవ్రగాయమైంది. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ విజేత కేజీఎఫ్



ట్రోఫీ అందుకుంటున్న జట్టు

శాంతిపురం: సంక్రాంతి సందర్భంగా గుండిశెట్టిపల్లె యువత నిర్వహించిన డే అండ్ నైట్ క్రికెట్ టోర్నమెంటులో కేజీఎఫ్‌కు చెందిన కర్ణాటక ఫ్రెండ్స్ లెవన్ జట్టు విజేతగా నిలిచింది. తొలిసారి ఫ్లడ్ లైట్ల వెలుగులో నిర్వహించిన ఈ టోర్నీలో మొత్తం 42 జట్లు పోటీ పడ్డాయి. విన్నర్స్‌గా నిలిచిన రూ కర్ణాటక జట్టుకు రూ 11,111, రన్నర్స్‌గా నిలిచిన కుప్పం సిక్సర్స్ జట్టుకు రూ 5,555, 3వ స్థానంలో నిలిచిన గుండిశెట్టిపల్లె బాయ్స్ జట్టుకు నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు.

కుప్పం కమిషనర్‌గా రాధిక

పుంగనూరు: కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా తిరుపతి కార్పొరేషన్‌లో సెక్రటరీగా పని చేస్తున్న కె.రాధికను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అక్కడ ఇన్‌చార్జ్ కమిషనర్‌గా పని చేస్తున్న పుంగనూరు కమిషనర్ నరసింహప్రసాద్‌కు అదనపు బాధ్యతలను తప్పించారు. మంగళవారం రాధిక బాధ్యతలు స్వీకరించారు.

ఉత్సాహంగా కనుమ

- గోవులకు ప్రత్యేక అలంకరణలు
- గంగరాజు చుట్టూ గో ప్రదక్షిణలు
- సంక్రాంతి శోభతో కళకళలాడిన పల్లెలు



పులిచెర్ల: కొత్తపేటలో నిర్వహిస్తున్న పశువుల పండగ

పలమనేరు: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని పలమనేరు నియోజకవర్గవ్యాప్తంగా మంగళవారం కనుమ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించారు. రైతులు వారి ఎద్లను, పాడి పశువులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామ దేవతల ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. అలాగే గ్రామాల్లోని ఆయా ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పశుసంపద ఆరోగ్యంగా ఉండాలని రైతులు కోరుకున్నారు. పలు గ్రామాల్లో ఏటా ఆనవాయితీగా నిర్వహించే ఎద్ల మెరవణి ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ఎద్దులను ప్రభలతో అలంకరించి గ్రామ నడివీధిలో పరుగులు తీయించారు. అలాగే, పలు గ్రామాల్లోనూ ఎద్లను పూజించి వీధుల్లో తిప్పారు. పలు గ్రామాల్లో మహిళలు పొంగళ్లను మోశారు. పలమనేరులో సంక్రాంతి సంబరాలు, ముగ్గుల పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. నియోజకవర్గంలోని ప్రజలు భోగ భాగ్యాలతో సంతోషంగా ఉండాలని స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ శుభాకాంక్షలను తెలిపారు.

గంగవరంలో..

గంగవరం: మండలంలో కనుమ పండుగ వేడుకలతో సంక్రాంతి సంబరాలు ముగిశాయి. మంగళవారం ఈ పండుగను మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోని పశువులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం వీధులలో వీటిని పరుగులు తీయించారు. అలాగే మహిళలందరూ ఉత్సాహంగా గొబ్బియాలు తట్టారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలకు పల్లెటూళ్లు సందడి..సందడిగా మారాయి.

పెద్దపంజాణిలో

పెద్దపంజాణి: తెలుగు వారి పెద్ద పండుగ సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల పాటు పల్లెలు సందడిగా మారాయి. బంధుమిత్రుల రాకతో కళకళలాడాయి. సోమవారం మహిళలు వేకువజామునే పవిత్ర స్నానాలు ఆచరించి, ఇళ్ల ముంగిట రంగవల్లులు తీర్చిదిద్దారు. గొబ్బెమ్మలను పెట్టి గౌరీదేవి వ్రతమాచరించారు. బతుకుదెరువు నిమిత్తం దూర ప్రాంతాలకు తరలివెళ్లిన స్థానికులు పండుగకు స్వగ్రామాలకు వచ్చారు. చిన్నారులు గాలి పటాలు ఎగురవేశారు. ఇక, మంగళవారం కనుమ పండుగను పురస్కరించుకుని పశువులను శుభ్రంగా కడిగి పసుపు, కుంకుమ బొట్లు పెట్టి, పూల దండలతో అలంకరించి గోపూజ చేశారు. అనంతరం ఎద్దులను పరుగులు తీయించారు. వీటిని నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. అనంతరం గ్రామ దేవతల చుట్టూ ప్రదర్శనలు చేయించారు. సాయంత్రం చిట్లాకుప్పకు నిప్పుపెట్టి తీర్థప్రసాదాలు అందజేశారు.

వి.కోటలో..

వి.కోట: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం ఘనంగా మకర సంక్రాంతి పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. పూజలకు మహిళా మండల అధ్యక్షురాలు శశికళ, వార్డు మెంబర్ కుమార్‌రాజా కుటుంబ సభ్యులు స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజల్లో తీర్థ,ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ధర్మకర్త సీతారామయ్య, దాత సూరి, చెంగ్రాయ, ముకుంద, శివ, దిలీప్ పాల్గొన్నారు.

వైభవంగా కనుమ వేడుకలు

బైరెడ్డిపల్లె: సంక్రాంతి పండుగల్లో భాగంగా చివరి రోజు మంగళవారం కనుమ వేడుకలను ప్రజలు ఆనందంగా జరుపుకున్నారు. ఉదయమే పశువులను శుభ్రంగా కడిగి గ్రామ దేవత ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు గ్రామ పొలిమేరల్లోని ఆలయాల వద్ద పొంగళ్లు పెట్టి అమ్మవారికి సమర్పించారు. దూరప్రాంతాల్లోని గ్రామస్తులు, బంధుమిత్రుల రాకతో గ్రామాలు కళకళలాడాయి.

సదుంలో..

సదుం: మండలంలోని పలు గ్రామాల్లో కనుమ పండుగను వేడుకగా నిర్వహించారు. ఉదయం చల్లను ఊరేగింపుగా తీసుకువెళ్లారు. గ్రామదేవతలకు పూజలు చేసి, అంబలి పంచి పెట్టారు. సాయంత్రం అలంకరించిన పశువులను గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన చిట్లాకుప్ప వద్దకు తీసుకువచ్చారు. కాటమరాజుకు పూజలు చేసి, పశువులతో ప్రదక్షిణలు చేయించారు. బయట ప్రాంతాల్లో స్థిరపడిన వారు పండుగలకు గ్రామాలకు రావడంతో సందడి నెలకొంది.

పులిచెర్ల మండలంలో..

పులిచెర్ల(కల్లూరు): మండల వ్యాప్తంగా కనుమ పండుగను కోలాహలంగా నిర్వహించారు. కొత్తపేటలో అలంకరించిన పశువులను వీధుల్లో పరుగులు తీయించారు. వాటిని నిలువరించేందుకు యువకులు పోటీ పడ్డారు. దీన్ని తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాలనుంచి జనం భారీగా తరలివచ్చారు. మండల వైఎస్సార్ సీపీ ఉపాధ్యక్షుడు ఆనంద, కో-ఆప్షన్ సభ్యులు సైపుల్లా, క్రిష్ణమూర్తి, రాజమూర్తి, అమరనాధరెడ్డి, నసీబ్ తదితరులు పాల్గొన్నారు.



గుడుపల్లెలో పరుగులు తీస్తున్న పశువులు

గుడుపల్లెలో..

గుడుపల్లె: కనుమ పండుగ వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పశువులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఇళ్ల లోగిళ్లను రంగవల్లులతో తీర్చిదిద్దారు. పశువులను శుభ్రంగా కడిగి, పసుపు రాసి, రంగులు వేశారు. గుడుపల్లె, కోటచెంబగిరి గ్రామాలలో పశువులను పరుగులు తీయించారు. దీనిని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి భారీ సంఖ్యలో జనం వచ్చారు. పరుగులు తీస్తున్న పశువులను నిలువరించిన యువకులు ఉత్సాహంగా కేరింతలు కొట్టారు.పశువులను తీసుకుని వచ్చిన రైతులకు పంచెలను బహుమతిగా ఇచ్చారు. అలాగే రాత్రి ఆయా గ్రామాలలో ఉత్సవాలను ఊరేగించారు.

శాంతిపురంలో..



చూపరులను ఆకట్టుకున్న ముగ్గు

శాంతిపురం: మకర సంక్రాంతి, కనుమ పండుగలను మండలవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఇళ్ల ముందు రంగుల ముగ్గులపై గొబ్బెమ్మలను పెట్టి, ఆవులు, ఎద్దులకు పూజలు చేశారు. సూర్యుడికి నైవేద్యంగా పొంగళ్లు వండి సమర్పించారు. ఇతర పట్టణాలు, ప్రాంతాల్లో స్థిరపడిన వారు కూడా పండుగకు సొంత ఊరికి రావడంతో గ్రామాల్లో సందడి కనిపించింది. 64 పెద్దూరు పంచాయతీలోని సోమాపురంలో స్థానిక నాయకులు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.







పలమనేరు: ప్రత్యేక అలంకరణతో గోవులను తీసుకెళ్తున్న రైతన్న, పెద్దపంజాణి: ఎద్దును నిలువరించేందుకు పోటీపడుతున్న యువకులు, బైరెడ్డిపల్లె: పొంగళ్లు పెట్టేందుకు వెళ్తున్న కైగల్ మహిళలు, సదుం: పూజలు చేస్తున్న గ్రామస్తులు, వి.కోట: అయ్యప్పస్వామి

రహదారి భద్రతలు పాటించండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాఘవరెడ్డి, పక్కన ఆర్టీసీ డీఎం

పుంగనూరు: ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలను పాటించి ప్రమాదాలు బారిన పడకుండా ఉండాలని సీఐ రాఘవరెడ్డి అన్నారు. మంగళవారం ఆర్టీసీ డిపోలో మేనేజర్ సుధాకరయ్య, ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు జయరామిరెడ్డితో కలసి రోడ్డు భద్రత మాసోత్సవాలను నిర్వహించారు. వేగంగా వాహనాలను నడపడం, ఓవర్‌టేక్ చేయడం ప్రమాదకరమన్నారు. అలాగే ప్రయాణికులు ఎక్కే, దిగే సమయంలో వాహ నాన్ని పూర్తిగా ఆపి ప్రయాణికులకు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. అలాగే మైనర్లకు ద్విచక్రవాహనాలను తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మైనర్లు యాక్సిడెంట్లకు కారకులైతే తల్లిదండ్రులపై కేసులు తప్పవని హెచ్చరించారు. లైసెన్సులు, తగిన రికార్డులు ఉన్న వాహనాలను మాత్రమే కొనుగోలు చేయాలని, అలాంటి వాటినే రహదారులలో వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

డాక్టర్లను నియమిస్తాం

- జాయింట్ కమిషనర్ సరళమ్మ



ప్రభుత్వాసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ సరళమ్మ

పుంగనూరు: స్థానిక ఏరియా ఆసుపత్రికి అవసరమైన డాక్టర్లు, సిబ్బందిని త్వరలో నియమించి 24 గంటలు వైద్యసేవలు అందిస్తామని వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ కమిషనర్ సరళమ్మ తెలిపారు. సోమవారం ఆమె డీసీహెచ్‌ఎస్ రాజశేఖర్‌రెడ్డితో కలసి ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను రోగులతో మాట్లాడి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రి కమిటీ చైర్మన్ డాక్టర్ శరణ్‌తో చర్చించారు. ఆమె మాట్లాడుతూ, సిబ్బంది నియామకంతోపాటు అవసరమైన సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆసుపత్రిలో సేవలు బాగున్నాయని కితాబిచ్చారు. డాక్టర్లు, నర్సులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు 'ఆసరా'

- తన పాలనలో వంచించిన చంద్రబాబు
- ఆదుకున్న జగన్‌మోహన్‌రెడ్డి
- ఇప్పటికే మూడు విడతల్లో లబ్ధి
- 4వ విడత పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



సమావేశమైన ద్వాక్రా గ్రూపు సభ్యులు

పెద్దపంజాణి: అక్కచెల్లెమ్మల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. వారికి అన్ని విధాలా అండగా నిలబడుతున్నారు. ఇతరులపై ఆధారపడకుండా స్వశక్తితో జీవించేలా ప్రోత్సహించేందుకు 'వైఎస్సార్ ఆసరా' పథకం అమల్లోకి తెచ్చారు. పొదుపు సంఘాల బ్యాంకు లింకేజీ రుణాలను నాలుగు విడతలుగా మాఫీ చేస్తాననే హామీ నిలబెట్టుకుంటున్నారు. ఇప్పటికే మూడేళ్ల నగదును డ్వాక్రా సంఘాల ఖాతాల్లో జమ చేశారు. ముచ్చటగా 4వసారి ఆసరాతో ఆదుకునేందుకు సర్వం సిద్ధం చేశారు.

నాడు మోసం చేసిన టీడీపీ సర్కారు

2014 ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళలకు లేనిపోని హామీలిచ్చారు. రుణామాఫీ చేస్తానని మాటిచ్చారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తరువాత అందరికీ శఠగోపం పెట్టిన మాదిరిగానే డ్వాక్రా చెల్లెమ్మలకు మొండిచేయి చూపారు. ఎన్నిసార్లు అడిగినా పట్టించుకున్న పాపానపోలేదు. చివరకు బ్యాంకర్ల నుంచి ఒత్తిడి పెరడంతో తమ సొంత డబ్బులతో మహిళలు రుణాలు చెల్లించారు. రుణాలు చెల్లించని బ్యాంకు ఖాతాలు ఎన్‌పీఏలుగా మారడంతో అక్కచెల్లెమ్మలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆదుకున్న సీఎం

చంద్రబాబును నమ్మి టీడీపీ హయాంలో నష్టపోయిన మహిళలు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజా సంకల్పయాత్ర చేసిన సమయంలో ఆయనకు తమ సమస్యలను నివేదించారు. సావధానంగా విన్న ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే ఆదుకుంటానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ఆసరా పథకాన్ని ప్రవేశపెట్టారు. ఇప్పటి వరకూ మూడు విడతలుగా నగదు జమ చేశారు. తాజాగా 4వసారి జమచేసేందుకు చర్యలు తీసుకోవడంతో డ్వాక్రా సంఘాల మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెద్దపంజాణి మండలంలో...

మొత్తం సంఘాలు	సంఘ సభ్యులు	విడతల వారీగా	రూ.కోట్లలో
1111	10,641	మొదటి విడత	11,17,81,425
1111	10,641	రెండవ విడత	11,17,81,425
1111	10,641	మూడవ విడత	11,17,81,425
1111	10,641	నాల్గవ విడత (త్వరలో)	11,17,81,425
మొత్తం			44,17,81,425

మహిళా పక్షపాతి సీఎం



గత టీడీపీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని మోసం చేసింది. అంతటితో ఆగకుండా ఎన్నికల సమయంలో పసుపు-కుంకుమ పేరుతో మళ్లీ మోసం చేయాలని చూసింది. కానీ సీఎం జగన్ ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలు మాఫీ చేసి మహిళల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. ఆయన మహిళా పక్షపాతి. **– జయమ్మ, మిట్టపల్లె**

హామీ నెరవేర్చిన సీఎం



ఎన్నికల సమయంలో ఎంతో మంది నాయకులు, ఎన్నో పార్టీలు హామీలు ఇవ్వడం ఆపై మరిచిపోవడం చూస్తూనే ఉన్నాం. అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీని తుచ తప్పకుండా అమలు చేస్తున్న జగన్‌మోహన్ రెడ్డి లాంటి సీఎంను ఇప్పుడే చూస్తున్నాం.ఆయన చెప్పినవి, చెప్పనవి కూడా చేస్తూ ఆదర్శప్రాయంగా నిలిచారు. ఆయనకు ఎప్పుడూ అండగా ఉంటాం. **– చినపాపమ్మ, బందార్లపల్లె**

థ్యాంక్యూ సార్



మాలాంటి మహిళల ఆర్థికాభివృద్ధికి సీఎం చేసిన సాయం వెలకట్టలేనిది. ప్రభుత్వ పథకాలలో ఎక్కువ మహిళలకే ప్రాధాన్యతనివ్వడంతో ఆయనకు మహిళలపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతోంది. **– పార్వతమ్మ, ఆకులవారిపల్లె**

హంద్రీ-నీవా పనులను పరిశీలించిన ఎమ్మెల్సీ



పంప్ హౌస్ వద్ద హంద్రీ-నీవా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ భరత్

- నేడు మండలంలోకి ప్రవేశించనున్న కృష్ణా జలాలు
- జలహారతి ఇవ్వనున్న ఎంపీ, ఎమ్మెల్సీ జెడ్పీ చైర్మన్

రామకుప్పం: మండలంలో జరుగుతున్న హంద్రీ-నీవా పనులను మంగళవారం చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ పరిశీలించారు. బైపరెడ్లపల్లె పంచాయతీ వర్దికుప్పం సమీపంలో హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు మండలానికి రానున్న నేపథ్యంలో బుధవారం ఉదయం 9 గంటలకు పెద్ద ఎత్తున జలహారతి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్సీ తెలిపారు. తనతోపాటు ఎంపీ రెడ్డెప్ప, చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాట మేరకు కుప్పం నియోజక వర్గానికి కృష్ణా జలాలు తీసుకువస్తున్నట్లు చెప్పారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో పెండింగ్‌లో ఉన్న హంద్రీ-నీవా పనులను త్వరితగతిన పూర్తి చేసినట్లు తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు హాజరుకావాలని కోరారు. మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో-కన్వీనర్ చంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ ఆనంద్, పార్టీ నేతలు పాల్గొన్నారు.

వడ్డెర కమ్యూనిటీ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్సీ



శాంతిపురం: భూమి చదును పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ, నాయకులు

శాంతిపురం: తుమ్మిశి పంచాయతీలోని దుంకుమాకనపల్లె వద్ద వడ్డెర కమ్యూనిటీ భవనం కోసం కేటాయించిన స్థలాన్ని ఎమ్మెల్సీ భరత్ మంగళవారం పరిశీలించారు. వడ్డెర కులస్తుల విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం జాతీయ రహదారి పక్కన 0.88 ఎకరాలను మంజూరు చేయడం విదితమే. ఇక్కడ చేస్తున్న భూమి పదును పనులు పరిశీలించిన ఎమ్మెల్సీ వడ్డెర కుల నాయకులతో మాట్లాడారు. కుప్పం చరిత్రలో తొలిసారిగా వడ్డెరను గుర్తించిన ప్రభుత్వం విలువైన భూమిని కేటాయించిందన్నారు. అన్ని కులాలను సమానంగా చూస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డి సహకారంతోనే ఇది సాధ్యమైందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్ సతీమణి దుర్గ, స్థానిక సర్పంచ్ చంగమరాజు, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దన్న, నాయకులు రమణప్ప, మొగిలీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

18న స్మారక పురస్కారాలు ప్రదానం



ధనుంజయ్



మునిరత్నం రెడ్డి

పలమనేరు: పట్టణంలోని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి కళామందిరంలో ఈనెల 18న స్మారక పురస్కారాలను ప్రదానం చేయనున్నట్టు ఆ సమితి నిర్వాహకులు తులసీనాథం నాయుడు తెలిపారు. పైనేని చిన్నబుచ్చినాయుడు పురస్కారాన్ని బెంగళూరుకు చెందిన ధనుంజయ్ రామకృష్ణకు, బసయ్య స్మారక పురస్కారాన్ని బత్తలపల్లి మునిరత్నం రెడ్డికి ప్రదానం చేస్తామని, అలాగే నగదు అందజేసి సన్మానించనున్నట్టు చెప్పారు.